ప్రజాశక్తి
మంగళవారం 6 జూన్ 2023
5

అల్లూరి సీతారామరాజు

వికలాంగులకు మోటార్ వాహనాల పంపిణీ

మోటారు బైక్‌లు పంపిణీ చేస్తున్న కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యే

ప్రజాశక్తి -పాడేరు: ఎపి వికలాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని ఆరుగురు వికలాంగులకు మోటారు వాహనాలను పంపిణీ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో వికలాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వీటిని లబ్ధిదారులకు కలెక్టర్ సుమిత్‌కుమార్, అరకు ఎంపి గొట్టేటి మాధవి, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, ట్రైకార్ చైర్మన్ శతక బుల్లిబాబు అందజేశారు. కార్యక్రమంలో వికలాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జయ మాధవి ఎంపిటిసి విజయలక్ష్మి, సర్పంచ్ సీతమ్మ పాల్గొన్నారు.

సమస్యలపై హాస్టల్ వర్కర్ల ధర్నా

ఐటిడిఎ ఎదుట ధర్నా చేస్తున్న హాస్టల్ వర్కర్లు

ప్రజాశక్తి - పాడేరు :తమ సమస్యలు పరిష్కరించాలంటూ గిరిజన సంక్షేమ వసతి గృహాల వర్కర్లు సోమవారం పాడేరు ఐటిడిఎ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డైలీవేజ్, అవుట్ సోర్సింగ్ వర్కర్లను రెగ్యులర్ చేయాలని, ప్రభుత్వ సెలవులు మంజూరు చేయాలని పెద్దపెట్టున నినదించారు. వసతి గృహాల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, పని ఒత్తిడి తగ్గించాలని, ఎనిమిది గంటల పని దినం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఐటిడిఎ పిఒ అభిషేక్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ హాస్టల్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. సంక్షేమ హాస్టళ్లలో చట్ట ప్రకారం ఎనిమిది గంటల పని దినం అమలు కావడం లేదని, రోజుకు 18 నుంచి 20 గంటలు పని చేయించుకుంటున్నారని తెలిపారు. పిల్లలు ఎక్కువగానూ, కార్మికులు తక్కువగానూ ఉండటంతో పని భారం పెరుగుతోందన్నారు. ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. డ్యూటీలో చనిపోయిన కార్మికుల కుటుంబాలను మానవతా దృక్పథంతో అధికారులు ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. రెండు నెలలుగా జీతాలు లేక కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పిఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. జూనియర్ కాలేజీల్లో పని చేస్తున్న కార్మికులకు నెలకు రూ.3500 వేతనం ఇవ్వడం దుర్మార్గమని అన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ హాస్టల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు బాలన్న, నాయకులు సోంబాబు పాల్గొన్నారు.

దత్తత గ్రామాల్లో అభివృద్ధిపై సమీక్ష

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ గొడ్డేటి మాధవి

పజాశక్తి -పాడేరు: సంసద్ ఆదర్శ గ్రామీణ యోజనలో ఎంపిక చేసిన గ్రామాలను ఆదర్శవంతమైన గ్రామాలుగా అభివృద్ధి చేయాలని అరకు ఎంపి జి మాధవి కోరారు.. సోమవారం కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో సంసద్ ఆదర్శ గ్రామీణ యోజనలో ఎంపి దత్తత చేసుకున్న గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపి దత్తత చేసుకున్న తొమ్మిది గ్రామాల్లో తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు, రహదారులు, భవనాలు, డ్రైనేజీల నిర్మాణాలపై జిల్లా అధికారులు, సర్పంచులతో చర్చించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ. కొయ్యూరు మండల కేంద్రంలో ఐదు పనులు, మంచింగపుట్టు మండలం సుజన కోటకు 15 పనులు, చింతపల్లి మండలం శనివారంలో 15 పనులు, తాజంగికి 3 పనులు, పాడేరు మండలకేంద్రంలో 25 పనులు, హుకుంపేట మండలం తడిగిరికి 3 పనులు, జికె. వీధి మండలం పంచులకు 4 పెదబయలు మండలం గంపరాయిలో ఒకటి, సీకరిలో రెండు పనులు మంజూరు చేశామన్నారు.. మంజూరు చేసిన పనులలో తాగునీరు, విద్యుత్తు సౌకర్యం, సిసి రోడ్లకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ ఎంపిక చేసిన తొమ్మిది గ్రామాలలో 74 పనులను ఎస్‌సిఎ, సిసిడిపి, సిఎస్ఆర్, ఉపాధిహామీ నిధులతో అభివృద్ధి చేస్తామన్నారు. ఉపాధి హామీ పథకంలో ఇప్పటి వరకు రూ.120 కోట్లు మెటీరియల్ కంపోనెంట్ కింద ఖర్చు చేసామన్నారు. పూర్తి చేసిన పనులకు రూ.70 కోట్లు చెల్లించడం జరిగిందన్నారుజల్ జీవన్ మిషన్ లో మంజూరు చేసిన పనులకు టెండర్లు పిలిచి పనులను కాంట్రాక్టరుకు అప్పగించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ సిఇఒ పి. శ్రీరామ్మూర్తి, డిఆర్‌ఒ. పి. అంబేద్కర్, డిపిఒ కొండలరావు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి.ఎస్ .నంద్, జిల్లా ఉద్యానవన అధికారి రమేష్ కుమార్ రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జమాల్ భాషా, ఐసిడిఎస్ పిడి ఎన్ సూర్యలక్ష్మి, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఐ. కొండలరావు, డిఇ. ఒ.సలీంభాషా, ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇ. లీలాక్రిష్ణ, డిఎల్‌పిఒ. పిఎస్.కుమార్, ఎంపిడి ఓలు, సర్పంచులు పాల్గొన్నారు.

త్యాగధనుడు పుణ్యారావు

హుకుంపేటలో పుణ్యారావు చిత్రపటానికి నివాళి

ప్రజాశక్తి- హుకుంపేట: సిపిఎం మాజీ మండల కార్యదర్శి పుణ్యారావు ద్వితీయ వర్ధంతి సోమవారం మండల కేంద్రంలోని సిపిఎం కాలనీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పుణ్యారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వైస్ఎంపిపి సూడిపల్లి కొండలరావు మాట్లాడుతూ గిరిజన ప్రజల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన త్యాగధనుడు పుణ్యారావు అని కొనియాడారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన హక్కులు, చట్టాలు అమలుకు అలుపెరగని పోరాటం చేశారని, గిరిజన గ్రామాల్లో ప్రజలకు తాగునీరు, రోడ్లు, వైద్యం, రేషన్‌కార్డులు, అటవీ హక్కుల పట్టాల మంజూరు వంటి వాటిపై పోరాటం చేశరన్నారు. మండల కేంద్రంలో గిరిజనుల కోసంపోరాడి జైలు జీవితం గడిపి, చివరకు గ్రామంలో సిపిఎం కాలనీ ఏర్పాటు ద్వారా వందలమందికి గూడు కల్పించారన్నారు, పుణ్యారావు జీవితం త్యాగంతో ముడిపడిందని కొనియాడారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నేత శొంఠ్యాన హైమావతి, గిరిజన సంఘం మండల నాయకులు కోరాబు కోటిబాబు, తోరంభ సోములు, వార్డు సభ్యులు అన్నపూర్ణ, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

అరకులోయ :అరకులోయ గిరిజన సంఘం కార్యాలయంలో హుకుంపేట గిరిజన సంఘం నాయకుడు సొంటేనే పుణ్యారావు రెండో వర్ధంతి ఘనంగా నిర్వహించారు.గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిలో సురేంద్ర, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పొద్దు బాలదేవ్ తదితరులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అతి చిన్న వయసు నుంచే, గిరిజనులకు అన్యాయం జరిగినప్పుడు ముందుండి పోరాటం నడిపించారని కొనియాడారు. ఆటపాట రూపంలో మన్యవాసులను చైతన్యం చేసి సమస్యలు పరిష్కారానికి సంఘాలు నిర్మాణం చేసి పోరాటాలు సమాయత్తం చేయడంలో కీలకపాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘ నాయకులు కె.మగ్గన్న, టి. హరి, కె.జగన్నాథం, ఐద్వా నాయకురాలు వివి.జయ, ఎస్‌బి .పోతురాజు ఎస్.ఆనంద్, మల్లేష్, కే. రామారావు పాల్గొన్నారు.

అరకులోయలో నివాళులర్పిస్తున్న నేతలు

గిరిజన సాంస్కృతిక సంబరాలను చూసొద్దాం రారండి..!

నేటి నుంచి గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహణ
మహాసభల నేపథ్యంలో అట్టహాసంగా ఏర్పాట్లు
ఆటా,పాట, మాటలతో హోరెత్తనున్న అరుకు

గిరిజన నృత్యం (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి- అరకులోయ :పర్యాటక కేంద్రమైన అరకులోయలో ఈనెల 6, 7,8 తేదీల్లో ఎపి గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన ఆదివాసీ సాంస్కృతిక సంబరాల నిర్వహణకు సర్వం సిద్ధమైంది. అంతరించిపోతున్న గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలను ఆచార వ్యవహారాలను పరిరక్షించడమే కాకుండా, వాటిని భావ్య ప్రపంచానికి తెలియజేయాలన్న సంకల్పంతో ఎపి గిరిజన సంఘం ఆధ్వర్యంలో గిరిజన ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు ప్రతిబింబించేలా వీటిని నిర్వహించ నున్నారు. ఈ సంబరాలను మాజీ ఎంపి పెనుమల్లి మధు ప్రారంభించ నున్నారు. అరకులోయ గిరిజన సంస్కతిక మ్యూజియం ఆవరణలో ప్రతిరోజు సాయంత్రం 6 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ సంబరాల్లో వివిధ గిరిజన ప్రాంతాల కళారూపాలు ప్రదర్శించనున్నారు. ఈ సంబరాల ప్రాంగణానికి స్వతంత్ర సమర యోధుడు మల్రి కామయ్య నామకరణం చేశారు. మునుపెన్నడూ లేని విధంగా గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలను ఉట్టిపడే విధంగా నిర్వహించే ఈ సంబరాలు దిగ్విజయంగా నిర్వహించడానికి ఆదివాసీఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజాసంఘాలు మద్దతు ప్రకటించాయి. ఈ వేదికలో ఆదివాసీ సంస్కతి, ఆట,పాట, మాట అన్న నినాదంతో సంబరాలు జరగనున్నాయి.సంబరాలు విజయవంతంగా నిర్వహించడానికి కమిటీలు ఏర్పడ్డాయి.ఆదివాసీ సంస్కతి, ఆట,పాట, మాట నిర్వహణ కమిటీ చైర్మన్‌గా టి. చిట్టిబాబు, రఘునాథ్‌లను ఎంపిక చేశారు.అలాగే మహాసభ నిర్వహణ కమిటీ, వాలంటీర్ల కమిటీ,అలంకరణ కమిటీ, అతిథులకు ఆహ్వాన కమిటీ ప్రతినిధులను కూడా ఏర్పాటు చేశారు. ఈ వేదికలో సీతంపేట, పార్వతీపురం, చింతూరు, రంపచోడవరం, బుట్టయ్యగూడెం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి పాడేరు ప్రాంతాల గిరిజనుల వివిధ సాంస్కృతిక కళారూపాలు ప్రదర్శించనున్నారు. 34 గిరిజన తెగలకు సంబంధించి సుమారు 30 రకాల కళారూపాలను ఈ వేదికలో ప్రదర్శించనున్నట్లు చైర్మన్ టి.చిట్టిబాబు, గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని గిరిజన సంస్కతిక థింసా, మోడల్ థింసా, కుందథింసా, గిరిజన వాయిద్యం, చోటిథింసా, కొమ్ముకోయ, టాయిల, కర్రల కోలాటం, గిరిజన పాటలను నృత్యం, బుట్టలథింసా, గిరిజన బ్యాండ్ బాజా, అలెక్ భజన, ఆదివాసీ బాలబాలికల నృత్యం, సంకిడి, సైలోరి, బుడియ, మయూరి థింసా, ఆదివాసి డప్పుల నృత్యం వంటి తదితర ప్రదర్శనలు వేయనున్నారు.

గిరిజన సాంప్రదాయ థింసా నృత్యం (ఫైల్‌ఫొటో)

మన్యం జిల్లాకు సంబంధించిన నందికొట్కు, సవర నృత్యం, సీతంపేటకు సంబంధించిన అందేలా రవళి, వంటి సంస్కృతిక ప్రదర్శనలు వేయనున్నారు.ఈ సంబరాల్లో సుమారు 500 మంది కళాకారులు ఈ సంస్కతిక ప్రదర్శనలో పాల్గొనున్నారు. సంస్కతిక సంబరాల నిర్వహణ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, వచ్చేవారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకున్నట్లు నిర్వహణ కమిటీ చైర్మన్ చిట్టిబాబు, గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలదేవ్ తెఎలిపారు. ఆధునిక సమాజంలో అంతరించిపోతున్న గిరిజన సంస్కతి, సాంప్రదాయాలను తిలకించి వాటిని పరిరక్షించడంలో భాగంగా ప్రతి ఆదివాసి పాల్గొని ఈ సంబరాలను విజయవంతం చేయాలని వారు కోరారు.
సంబరాలు విజయవంతంగా నిర్వహించడంలో భాగంగా సోమవారం ఎపి గిరిజన సంఘం కార్యాలయంలో వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజాసంఘాల నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించి, ఏర్పాట్లపై సమీక్షించి, అభిప్రాయాలను సేకరించారు.

సాంస్కృతిక సంబరాలను జయప్రదం చేయండి

మాట్లాడుతున్న గిరిజన సంఘం నేత సురేంద్ర

అరకులోయ రూరల్: ప్రముఖ పర్యాటక కేంద్రం అరకులోయలో ఈ నెల 8,9 తేదీల్లో నిర్వహించనున్న గిరిజన సంఘం 8వ రాష్ట్ర మహాసభలను పురస్కరించుకొని ఈ నెల 6,7, 8 తేదీల్లో గిరిజన మ్యూజియం ఎదుట ఆదివాసీ సాంస్కృతిక సంబరాలను జయప్రదం చేయాలని గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి పి బాలదేవ్ అన్నారు. మంగళవారం సాయంత్రం 5 గంటలకు ఆదివాసీ సాంస్కృతిక సంబరాలను మాజీ ఎంపీ పెనుమల్లి మధు ప్రారంభిస్తారన్నారు.

సోమవారం అరకువేలి గిరిజన సంఘం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, ఆదివాసీ సాంస్కృతిక సంబరంలో 30 రకాల వివిధ సాంస్కృతిక సాంప్రదాయ, కళారూపాలు ఆట, పాట, మాటలతో వివిధ కళలు ఆదివాసీ వాయిద్యం, ఆదివాసీ గేయాలు, నృత్యాలను కళాకారులు ప్రదర్శిస్తారన్నారు. గిరిజన కళాజాత బృందాలు, కళాకారులందరూ ఈ సంబరాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.. ఈ మహాసభల్లో గిరిజన సంఘం జాతీయ చైర్మన్ మాజీ ఎంపీ డాక్టర్ మీడియా బాబురావు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో కళాకారుల సంఘం కన్వీనర్ టి జోషి పాల్గొన్నారు.

పోలవరం నిర్వాసితులకు పునరావాసం, ప్యాకేజీ కల్పించాలి

సిపిఎం నాయకులు సీతారామయ్య, నాగేశ్వరరావు

ప్రజాశక్తి- కూనవరం

పోలవరం ప్రాజెక్ట్ వల్ల నష్టపోతున్న నిర్వాసితులకు తక్షణమే పునరావాసం కల్పించి, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అందజేయాలని సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మండలంలోని రేపాక గ్రామంలో సోమవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పనులను పరిశీలించడానికి వస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ముందు ప్రాజెక్టు ముంపు ప్రజలకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, ముంపులో వున్న భూములకు సంబంధించిన నష్టపరిహారం చెల్లించాలని, నిర్వాసితులకు రాష్ట్ర ప్రభుత్వం ఏ విధమైన చర్యలు తీసుకుంటుందో ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎం.నాగమ్మ, మాజీ సర్పంచ్ బొజ్జి, జోగయ్య నర్సింహ రావు తదతరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య

ఎంపిపి నిధులతో బోరుబావులు

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని మారుమూల నాగేంద్రపురం, రామాపురం, సున్నం మట్కా, సోడేర్ పాడు, దుర్బలంక తదితర ఐదు గ్రామాల్లో గిరిజనుల దాహార్తి తీర్చడానికి బోరుబావులు ఏర్పాటుకు ఎంపిపి కారం లక్ష్మి నిధులు మంజూరు చేశారు. ఈ మేరకు సోమవారం బోరుబావుల ఏర్పాటుకు సంబంధించిన పనులను ఎంపిపి లక్ష్మి ప్రారంభించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అడవిని నమ్ముకుని అడవి తల్లి ఒడిలో అనేక అవస్థలు పడుతూ కనీసం తాగడానికి గుక్కెడు నీరు లేక గిరిజనులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఆదివాసీలకు తాగునీటి పథకాలకు నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. ఏ ఒక్క గిరిజన గ్రామంలోనూ నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దమట్టపల్లి సర్పంచ్ వెట్టి లక్ష్మి, రామవరం సర్పంచ్ కారం బుచ్చమ్మ, సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, రైతు సంఘం కార్యదర్శి వడ్లది రమేష్, అఖిలభారత గిరిజన ఫోరం మెంబర్ కుంజ నాగిరెడ్డి, ఫారెస్ట్ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పనులను ప్రారంభిస్తున్న ఎంపిపి కారం లక్ష్మి

విప్ప గింజలు ఒలిచే మిషన్ వితరణ

ప్రజాశక్తి- చింతూరు

మండలంలోని ఏడుగుర్రళ్లపల్లి పంచాయతీ పరిధి చుక్కలపాడు గ్రామానికి చెందిన గిరిజనులకు ఆశా స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి సయ్యద్ సుభాని రూ.20వేలు విలువ చేసే విప్ప గింజలు ఒలిచే మిషన్‌ను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8 గంటల్లో విప్ప గింజలు ఒలిచే పనిని ఈ మిషన్‌తో అరగంటలో చాలా సులువుగా పూర్తి చేయవచ్చునని తెలిపారు. దీనిని జాగ్రత్తగా వాడుకుంటే గ్రామంలోని అన్ని కుటుంబాల వారు లబ్ధిపొందవచ్చని చెప్పారు. ఇప్పటివరకు తెలంగాణా, జార్ఖండ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో సుమారు 60 మిషన్లు సరఫరా చేసినట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది ఎన్ఆర్ఐ ప్రొఫెసర్ రతన్ ముల్చందని సహకారంతో చింతూరు మండలంలో ఎంపిక చేసిన 6 ఆదివాసీ గ్రామాల్లో 6 మిషన్లు ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. మన పరిసరాల్లోని అడవులు, నదులు, భూమిని రక్షించే బాధ్యత మనందరిపై సమిష్టిగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సంయుక్త కార్యదర్శి జె.వెంకటేష్, గ్రామ పెద్ద రవ్వ జోగయ్య, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

విప్ప గింజలు ఒలిచే మిషన్‌ను అందజేస్తున్న సయ్యద్ సుభాని

ప్రజల సమస్యలు వింటున్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్

స్పందనకు 32 దరఖాస్తులు

ప్రజాశక్తి - రంపచోడవరం

రంపచోడవరం ఐటిడిఎ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 32 దరఖాస్తులు ఇచ్చాయి. వీటిని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్, ఐటిడిఎ ఎపిఒ సిహెచ్.శ్రీనివాసరావు స్వీకరించారు. వై.రామవరం మండలం కానివాడ పంచాయితీ పరిధి బంద గ్రామం నుండి కానివాడ వరకు 6 కిలోమీటర్లు సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని, ఫైబర్ నెట్‌కు మరమ్మతులు చేయించాలని ఆ పంచాయతీ సర్పంచ్ పల్లాల శిల్పారాణి వినతిపత్రం అందజేశారు. ఇంజనీరింగ్ పూర్తి చేశానని, సివిల్ సర్వీసెస్ శిక్షణకు ఆర్థిక సహాయం చేయాలని అడ్డతీగల మండలం కొట్టంపాలెం గ్రామానికి చెందిన ఈక రాజేష్ విన్నవించారు. దేవీపట్నం మండలం దేవారం గ్రామంలో భూ సమస్య పరిష్కరించాలని తెల్లము కమన్నదొర, పోతవరం చిన్నారి గండి, దేవారం గ్రామాలలో వ్యవసాయ చెరువులకు సంబంధించిన సాగునీరు కొరకు తూరలు ఏర్పాటు చేయాలని ఎంపీటీసీ తుర్రం జగదీష్ దొర, ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ దరఖాస్తులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జాన్ రాజ్, డిఎస్.శాస్త్రి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.డేవిడ్‌రాజ్, రీజనల్ మెడికల్ ఆఫీసర్ ఓబి.ఇందిర, వెలుగు ఎపిడి ఎ.శ్రీనివాసరావు, హార్టికల్చర్ అధికారి రాంబాబు, ఎఎంఒ సి.శ్రీహరి, ఎడిఎం అండ్ హెచ్ఒ డాక్టర్ అనూష, వైద్యాధికారులు డాక్టర్ రాధిక, కె.లక్ష్మి, గోపిక, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు చైతన్య, ఎ.వెంకటేశ్వరరావు, రాజేంద్ర బాబు, రంగారావు, దుర్గాప్రసాద్, చైతన్య, ఏఈఎంవివి సత్యనారాయణ, డిప్యూటీ తహశీల్దారు చైతన్య బాబు, గిరిజన సంక్షేమ శాఖ డిడి కార్యాలయ సూపరింటెండెంట్ బి.కిషోర్, జిసిసి సీనియర్ మేనేజర్ ఎం.నాగ వెంకట, రాజారెడ్డి, సిడిపిఒ సంధ్యారాణి, లీగల్ సెల్ న్యాయవాది సత్యనారాయణ, మత్స్యశాఖ ఫీల్డ్ అధికారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి తదితరులు

విద్యుత్ ప్రమాద బాధితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి మారేడుమిల్లి

విద్యుత్ ప్రమాదంలో తీవ్ర గాయపడి నడవలేని స్థితిలో ఉన్న గిరిజనుడికి ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం లభించింది. మండలంలోని చట్లవాడ పంచాయితీ పరిధి బొజ్జలగొంది గ్రామానికి చెందిన సాదల అబ్బాయిరెడ్డి ఇటీవల విద్యుత్ ప్రమాదంలో తీవ్ర గాయపడి రెండు కాళ్ళు పోగొట్టుకుని, నడివలేని స్థితిలో ఉన్నాడు. దీంతో ఆయన కుటుంబ పోషణ కష్టంగా మారింది. పేదవారు కావడంతో వైద్య సేవలు కూడా పొందే స్థితి లేకుండా పోయింది. ఇది గమనించిన మారేడుమిల్లి వైసిపి నాయకులు ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు దృష్టికి తీసుకువెళ్లగా, వారి చొరవతో సీఎం సహాయనిధి నుంచి రూ.5 లక్షలు మంజూరయ్యాయి. సోమవారం బాధితుడికి ఈ చెక్కును ఎల్లవరం గ్రామంలో ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత బాబు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సార్ల లలిత కుమారి, సర్పంచులు కొండ జాకబ్, దూడ ప్రేమలత, కో ఆప్షన్ సభ్యుడు గురుకు ధర్మరాజు, పార్టీ మండల కన్వీనర్ సత్తి సత్యనారాయణ రెడ్డి, కార్యదర్శి గంగరాజు పాల్గొన్నారు.

ఉచిత కేన్సర్ నిర్ధారణ శిబిరం

ప్రజాశక్తి- మోతుగూడెం

చింతూరు మండలం, మోతుగూడెం ఏపీ జెన్కో సంస్థ, ఆత్మబంధువులం సేవా సంఘం ఆధ్వర్యంలో గ్రేస్ కేన్సర్ ఫౌండేషన్ సహకారంతో ఉచిత కేన్సర్ నిర్ధారణ శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ఈ శిబిరంలో అధిక సంఖ్యలో ఎపి జెన్కో ఉద్యోగులు, గ్రామ ప్రజలు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ 40 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరు కేన్సర్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. దీని వల్ల ఎవరికైనా కేన్సర్ ఉంటే మొదటి దశలోనే గుర్తిస్తే దానిని నయం చేసుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎపి జెన్‌కో చీఫ్ ఇంజనీర్ బి.శ్రీధర్, సర్పంచ్ సీత, ఆత్మబందువులం సేవా సంఘం ప్రతినిధి ఎస్.ఉషా కివన్, ఏపి జెన్కో ఎస్ఈ వెంకటేశ్వర్లు, డిఈ బాలకృష్ణ, ఏఈ శివ శంకర్, రమేష్, ఎఎస్‌ఓలు పాల్గొన్నారు. పౌండేషన్ వ్యవస్థాపకులు ఎపి జెన్కో చీఫ్ ఇంజనీర్‌ను, సర్పంచ్‌ను సత్కరించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - రంపచోడవరం

అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే నాగులాపల్లి ధనలక్ష్మి అధికారులను ఆదేచించారు. మండలంలో బందపల్లి పంచాయతీ పరిధి పెద్ద కోరుమిల్లి గ్రామంలో సోమవారం ఆమె గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి వైసిపి ప్రభుత్వ నాలుగేళ్లలో అమలు చేసిన పథకాల ద్వారా లబ్ధిదారులకు నగదు ఎంత వచ్చిందో తెలియజేశారు. రానున్న కాలంలో ఈ సంక్షేమ పథకాలను మరింత పకడ్బందీగా అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈదురుగాలులకు నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు

ప్రజాశక్తి- మోతుగూడెం

అల్లూరి సీతారామరాజు జిల్లా, చింతూరు మండలం, మోతుగూడెం గ్రామం పరిధిలో ఆదివారం సాయంత్రం ఈదురుగాలుల బీభత్సానికి అనేక చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. మోతుగూడెం నుండి గొడ్లగూడెం వరకు అనేక చెట్లు రోడ్డుకు అడ్డంగా పడటంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. గోపాలపురం వద్ద విద్యుత్ స్తంభం విరిగిపోవడంతో ఆ గ్రామానికి విద్యుత్ అంతరాయం ఏర్పడింది. గొడ్లగూడెంలో కొన్ని విద్యుత్ స్తంభాలు గాలి తాకిడికి ఒరిగిపోయాయి. విద్యత్ శాఖ అధికారులు, కార్మికులు విద్యుత్ పునరుద్ధరణ చర్యలు చేపట్టారు.

పునరుద్ధరణకు గొయ్యి తీస్తున్న దృశ్యం

ప్లాస్టిక్ రహితమే పర్యావరణ హితం

-జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

పలుచోట్ల పర్యావరణ పరిరక్షణ ర్యాలీలు, అవగాహన సదస్సులు

పాడేరులో ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి తదితరులు

ప్రజాశక్తి -యంత్రాంగం

పాడేరు: ప్లాస్టిక్ రహితమే పర్యావరణ హితమని, అటువంటి సమాజ స్థాపనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలక్టర్ సుమిత్ కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక మోదకొండమ్మ పాదాల పరిసరాలు, కిండంగి మామిడి తోటల పరిసరాల్లో స్థానిక ఎమ్మెల్యే కె. భాగ్యలక్ష్మి, ఐటిడిఎ పిఒ వి.అభిషేక్, అటవీ, పంచాయతీ, రెవెన్యు, ఐటిడిఎ, గిరిజన సంక్షేమ, సచివాలయ శాఖల అధికారులు, సిబ్బందితో కలిసి వంతాడపల్లి, మొదపల్లి పంచాయతీల పరిధిలో చెత్తను తొలగించగం, ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమంలో స్వయంగా పాల్గొన్నారు. ఏజెన్సీలో ప్లాస్టిక్ వినియోగం పెరుగుతోందని, స్థానికులు, పర్యాటకులకు అవగాహన కల్పించడం ద్వారా ప్లాస్టిక్ నియంత్రణకు కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, పర్యావరణాన్ని పరిరక్షించి, భావితరాలకు ఆహ్లాదకర వాతావరణ పరిస్థితులు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా తడిపొడి చెత్తబుట్టలను పంపిణీ చేసారు. కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి వినోద్ బాబు, డిపిఒ కొండలరావు, డిఎల్‌పిఒ పివిఎస్. కుమార్, గిరిజన సంక్షేమ డిడి కొండలరావు, తహసిల్దార్ త్రినాథరావు నాయుడు, పలువురు, జెడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు.

కుమ్మరిపుట్టు గురుకుల సంక్షేమ ఆశ్రమ పాఠశాల ఆవరణలో ఎంపి గొడ్డేటి మాధవి, కలక్టర్ సుమిత్‌కుమార్, పాడేరు ఎమ్మెల్యే కె. భాగ్యలక్ష్మి, ఐటిడిఎ పిఒ వి. అభిషేక్, డిఎఫ్ఒ వినోద్‌కుమార్ ,ట్రైకార్ చైర్మన్ శతక బుల్లిబాబు, మొక్కలు నాటారు.

పెదబయలు : పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా అటవీశాఖ ఆధ్వర్యంలో పలుగ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. అటవీ రేంజ్ అధికారి చంద్రశేఖరరావు ఆధ్వర్యంలో పెదబయలు వారపుసంత, గురుకుల పాఠశాల జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు గురుకుల పాఠశాల కళాశాల నుండి భారీ ర్యాలీ నిర్వహించారు. గురుకుల కళాశాలలో, రోగుల పేట కాలనీలో మొక్కలు నాటారు జిసిసి బ్రాంచి మేనేజర్ గాసి, అటవీ శాఖ సిబ్బంది కళాశాల సిబ్బంది పాల్గొన్నారు

అనంతగిరి : చిలకలగెడ్డ ఫారెస్ట్ చెక్ పోస్ట్ వద్ద అటవీశాఖ ఆధ్వర్యంలో స్థానిక ఎంపిపి శెట్టి .నీలవేణి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్లాస్టిక్ నియంత్రణ, మొక్కలు నాటడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చున్నారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు షేక్ మదీనా, స్థానిక సర్పంచ్ జి.అప్పారావు, అటవీ రేంజర్ దుర్గాప్రసాద్, సెక్షన్ ఆఫీసర్లు ఎస్. సీతారాం. శ్రీహరి, రవి, పంచాయతీ కార్యదర్శి. లావణ్య, డాక్టర్ .వరలక్ష్మి పాల్గొన్నారు

హుకుంపేట : పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగామండల కేంద్రంలోని సచివాలయం వద్ద సర్పంచ్ పూర్ణిమ, పంచాయతీ కార్యదర్శి ప్రదీప్, వికెఓ కొండబాబు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.

కుమ్మరిపుట్టు ఆశ్రమపాఠశాలలో ఎంపీ మాధవి...

చింతూరు : జిల్లా చింతూరు డివిజన్ కేంద్రంలో సోమవారం అటవీశాఖ ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. మన్యం వీరుల విగ్రహాల సెంటర్ నుండి డిఎఫ్ఓ కార్యాలయం వరకు ఈ ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా డిఎఫ్ఓ పుష్ప సౌజన్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని, ప్లాస్టిక్ వ్యర్ధాలను వాడకాన్ని అరికట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ రేంజర్ మోహిని విజయలక్ష్మి, డిఇటి రేంజ్ ఆఫీసర్ కొండలరావు, బేస్ క్యాంపు హెల్పర్లు, సర్పంచ్ కారం కన్నారావు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో...

చింతూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో వృక్ష శాస్త్ర విభాగం, ఎన్.ఎస్.ఎస్ విభాగం ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్నమాణిక్యం ప్లాస్టిక్ వాడకం వలన కలిగే నష్టాలను, వ్యర్థాల నిర్మూలనకు పాటించవలసిన పద్ధతుల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఎకనామిక్స్ విభాగాధిపతి జి.వెంకట్రావు, అధ్యాపకులు డాక్టర్ వై.పద్మ, కె. శైలజ, యం.నాగమోహనరావు, కె.శ్రీలక్ష్మి, కె.శ్రీదేవి, సిహెచ్.రాజబాబు, నూనె రమేష్, ఆర్.వాసిక, పి.గౌతమి, జి.సాయికుమార్, వై.ఇమ్మానుయేలు పాల్గొన్నారు.

సీలేరులో...

సీలేరు : జీకే వీధి మండలం సీలేరులో అటవీ శాఖ డిప్యూటీ రేంజ్ అధికారి ఆధ్వర్యంలో అటవీ శాఖ కార్యాలయం నుంచి సీలేరు మెయిన్ రోడ్డు వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా అటవీశాఖ డిప్యూటీ రేంజ్ అధికారి సతీష్ మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించవలసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరు ఇంటి ముంగిట్లో చెట్టు నాటి వాడిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సిబ్బంది, స్థానిక ఎంపిటిసి పిల్ల సాంబమూర్తి, ఇన్‌ఛార్జి సర్పంచ్ కె వల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీలేరులో ర్యాలీ నిర్వహిస్తున్న అటవీశాఖ సిబ్బంది

ఏపీ జెన్కో అధికారుల ఆధ్వర్యంలో

సీలేరు జల విద్యుత్ కేంద్రంలో పర్యావరణ పరిరక్షణపై పోస్టర్లను ఏపీ జెన్కో అధికారులు, సిబ్బంది ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంస్థ ఎస్ఇ కెకెవి.ప్రశాంత్ కుమార్, ఈఈలు లక్ష్మీనారాయణ, ప్రభాకర్ మాట్లాడుతూ పర్యావరణం కాపాడడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏడీఈలు అప్పలనాయుడు, క్రాంతి, ఏఈ టెక్నికల్ కృష్ణారావు, పావని, సబ్ ఇంజనీర్ శ్రీధర్, ఏపీ జెన్కో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

పెదబయలులో అటవీ సిబ్బంది ప్రతిజ్ఞ

అనంతగిరిలో మొక్కలు నాటుతున్న ఎంపిపి నీలవేణి తదితరులు

చింతూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

మూతబడిన దుకాణంలో వస్త్రాలను పరిశీలిస్తున్న ఆప్కో చైర్మన్ చిరంజీవి

చేనేత వృత్తి పరిరక్షణ ప్రభుత్వ ధ్యేయం

పది రోజుల్లో అరకు ఆప్కో దుకాణాన్ని తెరిపిస్తా : ఆప్కో చైర్మన్ చిరంజీవి

ప్రజాశక్తి- అరకులోయ : రాష్ట్రంలో చేనేత వృత్తిని పరిరక్షించడమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షుడు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి అన్నారు. సోమవారం అరకు లోయను సందర్శించి, మూతపడి ఉన్న ఆప్కో దుకాణాన్ని తెరిపించి పరిశీలించారు. దుకాణం మూతబడడానికి రూ.10 లక్షల నష్టమే కారణమని తెలుసుకుని నిర్వాహకులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

చేనేత వృత్తి పరిరక్షణ, లక్షలది మంది కార్మికులకు ఉపాధి కల్పనే లక్ష్యంగా 1976లో ప్రభుత్వం స్థాపించిన ఆప్కోకు రాష్ట్రవ్యాప్తంగా 950కు పైగా సొసైటీలు ఉన్నాయన్నారు.. ఆప్కోలో కొంతమంది సిబ్బంది అంకితభావంతో పని చేయకపోవడం వల్లే నష్టాలు రావడం బాధాకరమన్నారు. నవరత్నాల్లో భాగంగా 82 వేల మందికి ఏటా రూ.24వేల చొప్పున ప్రభుత్వం ఆర్థికసాయం అందిస్తోందన్నారు. చేనేత కార్మికులకు ఉపాధి కల్పనకు పలు ప్రభుత్వ రంగ సంస్థలకు వస్త్రాలు పంపిణీ చేస్తుందన్నారు. ఆప్కో నిర్వాహణకు ఏటా రూ.18కోట్లు ఖర్చుపెడుతుంటే, ఆదాయం రూ.మూడున్నర కోట్లు మాత్రమే వస్తోందన్నారు.ఆప్కోలో అవినీతి, అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు సిసి కెమెరాల నిఘాపెట్టడంతోపాటు ఆన్‌లైన్ బిల్లింగ్ విధానం అమలు చేస్తున్నామన్నారు. ఆప్కోకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయి రూ.మూడు కోట్లను డిసెంబర్ నెలాఖరులోగా చెల్లిస్తామన్నారు. ఆప్కోను నష్టాల నుంచి గట్టెక్కించే ప్రయత్నాలు చేస్తున్నామని, అక్రమాలకు పాల్పడిన వారిని గుర్తించి వారి నుంచి రికవరీ చేస్తున్నామన్నారు. ఆప్కోలో అమ్మకాలు పెంచేందుకు రాయితీలను పెంచడంతోపాటు, ప్రస్తుతమున్న స్టాకు క్లియరెన్స్ చేసేందుకు 66శాతం నుంచి 75శాతం వరకు రిబేటు ఇవ్వనున్నట్లు వెల్లడించారు.

ఆప్కోను లాభాలబాట పట్టించేందుకు సిఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. అయితే ఆప్కోలో ఉన్న ఖాళీలు సుమారు 350 ఇప్పట్లో భర్తీచేసే పరిస్థితి లేదన్నారు. ఆప్కో సేవలను గ్రామీణ ప్రాంతాలకు విస్తరించడం ద్వారా సంస్థకు పూర్వవైభవం తెచ్చేందుకు కృషిచేస్తున్నట్లు వెల్లడించారు

పర్యాటక కేంద్రమైన అరకులో ఆప్కో దుకాణం మూతబడడం బాధాకరమని, దీన్ని పదిరోజుల్లో తెరిపించేందుకు చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ జింక విజయలక్ష్మి, వైసిసి అల్లూరి జిల్లా పద్మశాలి అధ్యక్షులు గడ్డం నర్సింగరావు, ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ సూరిశెట్టి సూరిబాబు, వైసిపి నేతలు సమర్ధి రఘునాథ్, పెట్టేలి శుక్ర,సంతోష్ పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌గా ఈశ్వరమ్మ

ప్రజాశక్తి- పెదబయలు :స్థానిక రెసిడెన్సియల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా ఇన్‌ఛార్జి బాధ్యతలను ఆర్.ఈశ్వరమ్మ సోమవారం స్వీకరించారు. ఇక్కడి రెసిడెన్సియల్ కాలేజీ ప్రిన్సిపల్‌గా పనిచేసిన పి రామ్‌నాయక్ బదిలీ కావడంతో, ఆ స్థానంలో నోడల్ రెసిడెన్సియల్ పాఠశాల ప్రిన్సిపల్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆర్.ఈశ్వరమ్మకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు.

డ్రెయినేజీ నిర్మాణం పరిశీలన

ప్రజాశక్తి -అనంతగిరి : టోకూరు పంచాయతీ శిసాగుడ గ్రామంలో మండల పరిషత్ నిధులతో నిర్మిస్తున్న డ్రైనేజీ పనులను స్థానిక సిపిఎం సర్పంచ్ కిల్లో. మొస్య పరిశీలించారు గ్రామంలో మురుగునీరు, పారిశుధ్య సమస్య తలెత్తకుండా రూ.4లక్షల మండల పరిషత్ నిధులతో డ్రైనేజీ పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. పంచాయతీ పరిధిలోని మిగిలిన గ్రామాలకు తాగునీటి, రోడ్లు, డ్రైనేజీ వంటి కనీస సౌకర్యాల కల్పనకు జిల్లా కలెక్టర్, ఐటిడిఎ పిఒలను కలిసి కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సార. దొన్ను. సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్ శివశంకర్ గ్రామస్తులు అప్పన్న, కోటి, జీనబంధు పాల్గొన్నారు

డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ మొస్య

రైలు ప్రమాదంలో గాయపడ్డ వారిని పరామర్శిస్తున్న మంత్రి అమర్‌నాథ్, ఎంపీ ఎంవివి

బాధితులకు పరామర్శ

ప్రజాశక్తి - ఆరిలోవ, ఆరిలోవ

ఒడిశాలోని బాలాసోర్ వద్ద రైలు ప్రమాదంలో గాయపడి ఆరిలోవ హెల్త్‌సిటీలో చికిత్స పొందుతున్న బాధితులను రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విశాఖ పార్లమెంటు సభ్యులు ఎంవివి.సత్యనారాయణతో కలిసి సోమవారం పరామర్శించారు. క్యూ వన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆరిలోవ టిఐసి పాయింట్‌కు చెందిన కె.అరుణ, కె.రాజులను పరామర్శించి రూ.1,25,000 చెక్కులను అందజేశారు. అలాగే అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీకాకుళం జిల్లాకు చెందిన కె.పూజకు రూ.లక్ష చెక్కు అందించారు. ఈ సందర్భంగా వైద్యులు వారికి అందిస్తున్న చికిత్స గురించి అడిగి తెలుసుకున్నారు. జిల్లా వైద్య ఆరోగ్యాధికారి డాక్టర్ జగదీశ్వరరావు, భీమిలి ఆర్‌డిఒ భాస్కర్ రెడ్డి, చినగదిలి గ్రామీణ తహశీల్దారు రమణయ్య, ఆరిలోవ సిఐ సోమశేఖర్, క్యూ వన్ ఆసుపత్రి అధినేత రమణమూర్తి, అపోలో సిఇఒ రామచంద్ర తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అమర్‌నాథ్ మీడియాతో మాట్లాడుతూ రైలు ప్రమాద బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామన్నారు.

ఘనంగా 'ఎకో-వైజాగ్' ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా విశాఖ బీచ్‌రోడ్డులో జివిఎంసి ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన 'ఎకో–వైజాగ్' కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. పంచ సూత్రాలు అన్నట్టు ఐదు రకాలుగా విశాఖలో పచ్చదనం పెంపొందించేందుకు జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టిటిడి ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి హాజరయ్యారు. పర్యావరణాన్ని కాపాడుకోవాలంటూ మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆధ్వర్యంలో కాళికామాత గుడి నుంచి వైఎస్ఆర్ విగ్రహం వరకు చేపట్టిన ర్యాలీ విజయవంతమైంది. ఈ సందర్భంగా బీచ్ రోడ్డులో ఏర్పాటు చేసిన జివిఎంసి స్టాళ్ల ప్రదర్శన కూడా ఆకట్టుకుంది. రూ.10 వేస్తే క్లాత్ బ్యాగ్ రావడం, ప్లాస్టిక్ వ్యర్థాలతో తయారు చేసిన షూలు, సీడ్‌బాల్స్ సహా పిచ్చుకల కోసం ఉంచిన బౌల్స్ వంటివి ఆకట్టుకున్నాయి. పర్యావరణ పరిరక్షణలో దేశ వ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ నాలుగో స్థానంలో ఉందని అధికారులు ప్రకటించగా, సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి చొరవతో దానిని ఒకటో స్థానానికి తీసుకువచ్చేందుకు అంతా ప్రయత్నించాలని వైవి.సుబ్బారెడ్డి విజ్ఞప్తి చేశారు. నగర మేయర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు, కాలుష్య నియంత్రణకు జివిఎంసి యంత్రాంగం ఎంతో కృషి చేస్తోందన్నారు. విశాఖలో కాలుష్య నియంత్రణ, తక్కువ మోతాదు కలిగిన ప్లాస్టిక్ విక్రయించేవారిపై నిఘా, పచ్చదనం పెంపు, నిబంధనలపై అవగాహన పెంచేందుకు జివిఎంసి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 10 ప్రత్యేక వాహనాలను అతిథులు ఆవిష్కరించారు. అంతేకాకుండా భూగర్భ మురుగును వెలికి తీసేందుకు అత్యాధునిక సాంకేతికతతో ముంబయి తరహాలో ఇక్కడా ఓ వాహనాన్ని అందుబాటులోకి తెచ్చారు. కార్యక్రమంలో విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీలు పాకలపాటి రఘువర్మ, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

కాలుష్య రహిత నగరంగా విశాఖ

కాలుష్య రహిత నగరంగా విశాఖను తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆమె పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉడా చిల్డ్రన్ ఎరీనా థియేటర్‌లో పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పర్యావరణ దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని చిత్రలేఖనం లాంటి పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ సభ్యులు సాధిక్ పాల్గొన్నారు.

రైలు ప్రమాద మృతులకు ఘన నివాళి

ఘోర సంఘటనకు కేంద్రమే బాధ్యత వహించాలి

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి : ఐద్వా, సిఐటియు నేతల డిమాండ్

విశాఖలో కొవ్వొత్తుల ప్రదర్శనలో పాల్గొన్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి, తదితరులు

ఒడిశాలోని బాలాసోర్ వద్ద జరిగిన ఘోర రైలు ప్రమాదంలో మృతిచెందిన వారికి శ్రద్ధాంజలి ఘటిస్తూ విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో ఐద్వా, సిఐటియు, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యాన సోమవారం కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు. ప్రమాద బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రైల్వేపై కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిపై మండిపడ్డారు.

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

ఒడిశాలో జరిగిన ఘోర రైలు ప్రమాదానికి కేంద్ర ప్రభుత్వమే పూర్తిగా బాధ్యత వహించాలని, ప్రమాద కారణాలపై విచారించి, బాధ్యులను కఠినంగా శిక్షించాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి, సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ డిమాండ్ చేశారు. రైలు ప్రమాద మృతులకు శ్రద్ధాంజలి ఘటిస్తూ ఐద్వా, సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం విశాఖ రైల్వేస్టేషన్ మెయిన్ గేటు వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రమాదం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. సాంకేతిక పరిజ్ఞానం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో సహా అత్యున్నత స్థాయికి చేరిన ఈ దశలో లూప్‌లైన్‌లోకి కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ వెళ్లడం రైల్వే శాఖ అశ్రద్ధను, ప్రమాణాలు పాటించకపోవడాన్ని తెలియజేస్తోందన్నారు. మరణించిన, క్షతగాత్రులైన వేల కుటుంబాలు ఆ బాధను భరించాల్సిన స్థితికి నెట్టబడ్డాయన్నారు. ప్రమాద బాధితులకు సిఐటియు, ఐద్వా కమిటీలు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ ఘోర దురంతానికి కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ బాధ్యత వహించాల్సి ఉందన్నారు. బుల్లెట్ రైళ్లు, వందే భారత్ లాంటి హై స్పీడ్ రైళ్లను ప్రవేశపెడుతున్నటువంటి ప్రభుత్వం తగిన భద్రతా చర్యలు కూడా చేపట్టాల్సి ఉందన్నారు. సామాన్య ప్రజలు, ప్రయాణికుల బాధలను పట్టించుకోకుండా రైల్వేలో కలవారి భోగాలకు ప్రాధాన్యతనివ్వడం పెరిగిందన్నారు. రైల్వేను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు ప్రైవేటీకరణ చేస్తున్నారని, సామాన్యుల ప్రాణాలను ఫణంగా పెడుతున్నారని విమర్శించారు. రైలు ప్రమాద బాధిత కుటుంబాలను సంపూర్ణంగా ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని చర్యలూ చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.పద్మ, వై.సత్యవతి, కె.వేణు, సుమిత్ర, పుష్ప, భారతి, మాధురి, సిఐటియు నాయకులు పి.వెంకటరెడ్డి, ఎస్.జ్యోతీశ్వరరావు, సీత, పి.వెంకటరావు, క్యాబ్ డ్రైవర్స్ అండ్ ఓనర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.శ్రీరాములు, డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు యుఎస్ఎన్.రాజు, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ ఎం.కామేశ్వరి పాల్గొన్నారు.

అచ్యుతాపురం : ఒరిస్సాలోని బాలాసోర్ రైలు ప్రమాదంలో మృతి చెందిన వారికి సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం మండలంలోని తిమ్మరాజుపేట జంక్షన్‌లో కొవ్వొత్తులతో మానవహారం నిర్వహించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర నాయకులు సుబ్బారావమ్మ, బేబీరాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి జి కోటేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో మోడీ వచ్చిన తర్వాత రైల్వే ప్రైవేటీకరణ విధానాలు మరింత విస్తృతంగా జరగడం, 3 లక్షల వరకు రైల్వేలలో ఖాళీలు భర్తీకి చేయకపోవడం, ఒక్కొక్క విభాగాన్ని ప్రైవేటీకరించటం, ఉన్న ఉద్యోగులపై పని ఒత్తిడిగా మారడంతో ఈ ఘోర ఘటన జరిగిందని పేర్కొన్నారు. ఈ ప్రమాదానికి బిజెపి ప్రభుత్వమే బాధ్యత వహించాలని, ఈ యొక్క ఘటనపై సమగ్ర దర్యాప్తు జరపాలని, రైల్వే ప్రైవేటీకరణ విధానాలు విడనాడాలని, ఖాళీలు భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, సిఐటియు నాయకులు ఆర్.రాము, కె.సోమునాయుడు, వీవీ శ్రీనివాసరావు, ఎస్ బ్రహ్మాజీ, రంగారావు, ఉపాధ్యాయ నాయకులు అప్పారావు అంగన్వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విశాఖలో వైసిపి నాయకుల భూ దోపిడీ

టిడిపి మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ నగరంలో వైసిపి నేతలు విచ్చలవిడిగా భూములు దోచుకున్నారని టిడిపి మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆరోపించారు. ఈ భూ దోపిడీ వ్యవహారంపై విజయసాయిరెడ్డి, రాష్ట్ర మంత్రులు సమాధానం చెప్పాలని సోమవారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన డిమాండ్ చేశారు. సిరిపురం జంక్షన్ సిబిసిఎన్‌సి భూముల్లో జరుగుతున్న నిర్మాణ వివరాలు కావాలని సమాచార హక్కు చట్టం కింద కలెక్టర్ కార్యాలయంలో ఒక దరఖాస్తు, జివిఎంసి కార్యాలయంలో ఒక దరఖాస్తును తాను ఇచ్చినట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖలో భూములను వైసిపి నేతలు విచ్చలవిడిగా దోచుకున్నారని, వాటికి వివరణ ఇవ్వాల్సిన బాధ్యత అధికారులకు ఉందని అన్నారు. ఇచ్చిన అర్జీలకే దిక్కులేనపుడు జగనన్నకు చెబుదాం అనే కార్యక్రమం దేనికని దుయ్యబట్టారు. సిరిపురంలో ఉన్న క్రిస్టియన్ సంస్థకు చెందిన సిబిసిఎన్‌సి భూముల్లో 18 వేల చదరపు గజాల స్థలంలో తవ్వకాలు దేనికని ప్రశ్నించారు. ప్రైవేటు వారికి అపార్టుమెంట్ కట్టడానికి ఎలా అనుమతులు ఇచ్చారో తెలియాల్సి ఉందన్నారు. భూ దోపిడీపై 30 రోజుల్లో సమాధానం రాకుంటే అప్లేట్ అథారిటీకి వెళతామని, అప్పటికీ ఇవ్వకపోతే హైకోర్టును ఆశ్రయిస్తామని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర లీగల్‌సెల్ ప్రధాన కార్యదర్శి పిఎస్.నాయుడు, ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శి జాన్ పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జివిఎంసి పరిధిలో ఎన్విరాన్‌మెంట్ అండ్ శానిటేషన్ సెక్రటరీలకు సచివాలయం టైమింగ్స్ అమలు చేయాలని, అక్రమ సస్పెన్సలు, వేధింపులు ఆపాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆంధ్రప్రదేశ్ వార్డు సచివాలయ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీల అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా అధికారులకు స్పందనలో అందించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు కె.పీటర్, జె.అహర్ని, ఎన్.పార్థసారధి మాట్లాడారు. వీరి పోరాటానికి ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు పడాల రమణ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఎస్.ప్రసన్న, ఝాన్సీ రాణి, భాగ్యలక్ష్మి, లక్ష్మీదేవి, ఆడారి శివ, మంగరాజు, శివశంకర్, రమేష్ రాము, సుధీర్ పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

7న పోర్టు మెయిన్ గేటు వద్ద ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ పోర్టులో ఎటువంటి షరతులూ లేని వేతన ఒప్పందం వెంటనే అమలు చేయాలని యునైటెడ్ పోర్ట్ అండ్ డాక్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి బి.జగన్ డిమాండ్ చేశారు. సోమవారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేతన ఒప్పందంపై కార్మిక నష్టదాయకమైన సబ్ కమిటీ రిపోర్టును రద్దు చేయాలన్నారు. డిమాండ్ల సాధన కోసం ఈ నెల 7న పోర్టు మెయిన్ గేటు వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ, విడిఎల్‌బి వర్కర్స్ యూనియన్ (సిఐటియు) కార్యదర్శులు, బి.లక్ష్మణరావు, గణేష్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు.

రెజ్లర్లకు మద్దతు తెలుపుతున్న నాయకులు

రెజ్లర్లకు ప్రజా సంఘాల మద్దతు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ సింగ్‌ను పదవి నుంచి తొలగించాలని, తక్షణం అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం సాయంత్రం ఐద్వా, డివైఎఫ్ఐ, సిఐటియు ఆధ్వర్యంలో ఎం.సుబ్బారావు అధ్యక్షతన పూర్ణా మార్కెట్ దుర్గాలమ్మ టెంపుల్ వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు. ఢిల్లీలోని రెజ్లర్ల పోరాటానికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఐద్వా నాయకురాలు అన్నపూర్ణ మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం వచ్చిన తరువాత మహిళలపై లైంగిక వేధింపులు పెరిగాయంటూ ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు కె.సంతోష్ కుమార్, సిఐటియు నాయకులు కెవిపి చంద్రమౌళి, మహిళా సంఘం నాయకులు కె.వరలక్ష్మి, విజయ, పార్వతి, ముఠా యూనియన్ నాయకులు పైడిరాజు పాల్గొన్నారు.